ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -120 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 3 జూన్ 2026

# అమరావతి రైతులకు అండగా ఉంటాం

**లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేసి న్యాయపోరాటం చేస్తాం**

**అవసరం అయితే భూములు వెనక్కి ఇస్తాం**

**మాజీ సీఎం వైఎస్ జగన్**



**అమరావతి:జూన్ 02ఆంధ్ర ప్రగతి**

అమరావతి రాజధాని రైతులకు అండగా ఉంటామని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి చెప్పారు. మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో రాజధాని ప్రాంతానికి చెందిన ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు, ఎర్రపాలెం, కుర్రగల్లు గ్రామాలకు చెందిన రైతులు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి రైతుల కోసం పార్టీ తరపున లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేస్తామని జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. అక్కడి రైతుల భూములు కాపాడేందుకు న్యాయ పోరాటం చేస్తామని, రైతుల భూములు బలవంతంగా లాక్కోవడం దారుణమని పేర్కొన్నారు. అమరావతి రైతులకు న్యాయం చేస్తామని, ఇప్పుడు దౌర్జన్యం చేస్తున్న వారందరి పని పడతామని అన్నారు. తప్పు చేస్తున్న ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించాల్సిందేనని అన్నారు. రైతులను సంతోష పెట్టే విధంగా**మిగతా 2లో...**

# ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం వద్దు..

## గొడ్డలి పార్టీతో జాగ్రత్త: శ్రేణులకు చంద్రబాబు కఠిన సందేశం

- ఎస్ఐఆర్‌ను నిర్లక్ష్యం చేయొద్దని పార్టీ శ్రేణులకు చంద్రబాబు ఆదేశం
- చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలంటూ ప్రత్యర్థి పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు
- ఎస్ఐఆర్ ప్రక్రియలో మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో సమన్వయం ముఖ్యం అని సూచన
- కార్యకర్తల సంక్షేమం, సాధికారతకు పార్టీ పెద్దపీట వేస్తుందని హామీ







**అమరావతి:జూన్ 02ఆంధ్ర ప్రగతి**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా భవిష్యత్తులో నష్టపోతామని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు గట్టిగా దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో, 'గొడ్డలి పార్టీ' విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, 'చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి'**మిగతా 2లో...**

# మూడో దేశం జోక్యం కుదరదు





**నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన**

- భారత్-నేపాల్ సరిహద్దు వివాదంలో మూడో దేశం జోక్యం కుదరదని స్పష్టం చేసిన భారత్
- ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత విదేశాంగ శాఖ వెల్లడి
- భారత్, నేపాల్ పరస్పరం భూభాగాలు ఆక్రమించుకున్నాయన్న నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు
- ద్వైపాక్షిక చర్చలకే కట్టుబడి ఉన్నామని భారత్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :జూన్ 02,ఆంధ్ర ప్రగతి**

భారత్, నేపాల్ మధ్య ఉన్న సరిహద్దు వివాదం పూర్తిగా ద్వైపాక్షిక అంశమని, ఇందులో మూడో దేశం ప్రమేయానికి ఆస్కారమే లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ప్రాతిపదికన పరిష్కరించుకోవాలని పేర్కొంది.నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల పార్లమెంటులో చేసిన**మిగతా 2లో...**

# ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

## జనసేన పుట్టిందే తెలంగాణలో అందుకే ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేస్తుంది

- తెలంగాణ గడ్డపై నుంచే పోరాటం పుణికి పుచ్చుకున్నా
- తెలంగాణ అంటే గౌరవంతోనే కొండగట్టుకు కోట్ల విరాళం
- తెలంగాణను వ్యతిరేకించిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు
- తెలంగాణకు ద్రోహం జరిగితే గొంతు లేపేది జనసేనే
- తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం
- ఎవరి తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు
- మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ

**హైదరాబాద్,జూన్ 02ఆంధ్ర ప్రగతి**

: తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు. **మిగతాది 2లో...**



# కుల వివక్షకు తావులేని సమానత్వ సమాజ నిర్మాణానికి అధికారులు కృషి చేయాలి.

**ఎస్సీ కమీషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్**



4లో.

# తమిళనాడులో బీజేపీకి గట్టి షాక్.. పార్టీకి అన్నామలై రాజీనామా!

**పార్టీ పొత్తులు, అవకాశాలపై తీవ్ర అసంతృప్తి**

**త్వరలో సొంతంగా రాజకీయ ఉద్యమం ప్రారంభించే అవకాశం**

**జూన్ 02ఆంధ్ర ప్రగతి**

తమిళనాడు బీజేపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఫైర్ బ్రాండ్ నేతగా పేరుపొందిన అన్నామలై మంగళవారం పార్టీకి రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, **మిగతా 2లో...**



# భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!: కేంద్రం కీలక అడ్వైజరీ

- అంతర్జాతీయ ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడంతో అప్రమత్తత
- ఈ వైరస్‌కు టీకాలు లేకపోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన

**న్యూఢిల్లీ :జూన్ 02ఆంధ్ర ప్రగతి**

భారతదేశంలో ఇప్పటివరకు ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే, కొన్ని ఆఫ్రికా దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తి తీవ్రమవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రయాణికుల కోసం**మిగతా 2లో...**





# రాష్ట్రాభివృద్ధే సంకల్పం

- తెలంగాణ రైజింగ్ సారథులు రైతులు, రైతు కూలీలే
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీనే లక్ష్యం
- గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఫ్యూచర్ సిటీ
- ఆర్థిక శక్తి కేంద్రాలుగా మహిళా సంఘాలు
- :(సీఎం ఏ రేవంత్‌రెడ్డి(ఘనంగా తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకలు
- జాతీయ పతకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- 18 మంది పోలీసులకు ప్రతిభా పురస్కారాలు

**హైదరాబాద్జూన్ 02ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ రైజింగ్-2047కు సారథులు రైతులు, రైతు కూలీలేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2047నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ సంకల్పం, తెలంగాణను ప్రపంచానికే గేట్‌వేగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం **మిగతా 2లో...**



# సీబీఎస్ఈ చైర్మెన్, సెక్రెటరీ బదిలీ

- ఓఎస్ఎం సేవలపై విచారణ కమిటీ
- వివాదం నేపథ్యంలో కేంద్రం నిర్ణయాలు
- పార్లమెంట్ ప్యానెల్ కమిటీ ఎదుటకు రాక ముందే చర్యలు





2లో.

# బంగారం రీసైకిల్ చేద్దాం


**: ప్రధాని మోదీ పిలుపు**

**బంగారం దిగుమతులు తగ్గించి విదేశీ మారక నిల్వలను కాపాడటమే లక్ష్యం**

**ఒక శాతం బంగారం రీసైకిల్ చేసినా దిగుమతులు 30% తగ్గుతాయని నిపుణుల అంచనా**

**న్యూఢిల్లీ :జూన్ 02ఆంధ్ర ప్రగతి**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఒక కీలక పిలుపునిచ్చారు. కొత్తగా బంగారం దిగుమతి చేసుకునే బదులుగా ఇళ్లలో, దేవాలయాల్లో నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని రీసైక్లింగ్ చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. **మిగతా 2లో...**



# ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం వద్దు..

**మొదటిపేజీ తరువాయి**

అంటూ ప్రత్యర్థి పార్టీని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, పరిశీలకుల కోసం నిర్వహించిన ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం పార్టీ భవిష్యత్ కార్యాచరణకు, ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టేలా సాగింది.



**ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం వద్దు..**

ప్రతి 20-25 ఏళ్లకు ఒకసారి జరిగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమని చంద్రబాబు ఉద్ఘాటించారు. "ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితానే పునాది. దీని ఆధారంగానే వ్యూహాలు, ప్రణాళికలు ఉంటాయి. జులై 14లోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ జరుగుతుంది. ఈ లోగా ఓట్ల చేర్పింపుల ప్రక్రియ పక్కాగా పూర్తి కావాలి. మన ఓట్లు ఉన్నాయా, లేవా అని నిరంతరం చూసుకోవాలి. ఎస్ఐఆర్‌ను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలి. ఈ ప్రక్రియను నేను ప్రతిరోజూ పర్యవేక్షిస్తాను" అని స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఏపీ ఓటర్లు తిరిగివచ్చి ఓటు వేయడం వల్లే కూటమి 164 స్థానాల్లో గెలిచిందని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.

**'గొడ్డలి పార్టీ'తో జాగ్రత్త..**

ప్రతిపక్షంపై విరుచుకుపడుతూ చంద్రబాబు తీవ్ర పదజాలం ఉపయోగించారు. "చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి, లేకపోతే అది విషం చిమ్ముతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. నేను ఎన్నో పోరాటాలు చేశాను కానీ, ఇలాంటి నీచులతో ఎప్పుడూ చేయలేదు" అని అన్నారు.

మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేశారని, గట్టిగా కౌంటర్ ఇవ్వగానే తోక ముడిచారని విమర్శించారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలను వైసీపీ కార్యకర్తే తొలగించాడని, పోలీసులు వేగంగా స్పందించకుంటే ఆ నెపం టీడీపీపై నెట్టేవారని ఆరోపించారు. వివేకా హత్య కేసు ఒక కేస్ స్టడీ అని, ఇలాంటి కుట్రపూరిత రాజకీయాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**మిత్రధర్మం మనకు తొలి పరీక్ష..**

ప్రభుత్వంలోనే కాకుండా, పార్టీ కార్యక్రమాల్లోనూ మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో సంపూర్ణ సమన్వయం పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "ఎన్నికలప్పుడు కలిసి, మిగతా రోజుల్లో పట్టించుకోకపోతే కుదరదు. ఎస్ఐఆర్ ప్రక్రియ మన సమన్వయానికి తొలి పరీక్ష. దీని కోసం మూడు పార్టీలతో కో-ఆర్డినేషన్ కమిటీ వేస్తాం. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల మిత్రపక్షాలు లేకపోయినా, వారిని కలుపుకొని వెళ్లాలి. 2024 ఎన్నికల కంటే ఎక్కువగా వారితో కలిసి పనిచేయాలి. మిత్రధర్మాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త పాటించాల్సిందే" అని ఆదేశించారు.

**కార్యకర్తలే పార్టీకి బలం.. ఇంటింటికీ ప్రచారం**

కార్యకర్తల సంక్షేమం, సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా, పిల్లల చదువు, నైపుణ్య శిక్షణ వంటి కార్యక్రమాలను వివరించారు. తాను అనుచరులను కాదని, సమర్థవంతమైన నాయకులను కోరుకుంటానని, అలాంటి నాయకత్వమే పార్టీకి బలమని అన్నారు.

రాబోయే కార్యాచరణను ప్రకటిస్తూ.. "జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు 45 రోజుల పాటు ఇంటింటి ప్రచారం చేపడతాం. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిద్దాం. ఈ ప్రచారంలో నేను కూడా పాల్గొంటాను. అందరం సైకిళ్లపై, వీలైతే ఈ-సైకిళ్లపై వెళ్లి ప్రజలను కలుద్దాం" అని పిలుపునిచ్చారు. పోలవరం ప్రాజెక్టును తిరిగి గాడిన పెట్టామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశామని, ఈ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. నామినేటెడ్ పదవుల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తామని హామీ ఇచ్చారు.

# భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!: కేంద్రం కీలక అడ్వైజరీ

**మొదటిపేజీ తరువాయి**

మార్గదర్శకాలను జారీ చేసింది.

గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించిన వారు తమ ఆరోగ్యాన్ని స్వయంగా పర్యవేక్షించుకోవాలని సూచించింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినవారు స్వీయ నిర్బంధంలోకి వెళ్ళాలని సూచించింది.జ్వరం, తీవ్రమైన బలహీనత, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలు, దద్దుర్లు లేదా కారణం లేకుండా రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరింది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని తెలిపింది. అధికారుల సాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 1075కు కాల్ చేయాలని సూచించింది.

డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో కొత్త రకం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మే 17న దీనిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. ఈ ప్రత్యేక వైరస్‌కు ప్రస్తుతం ఆమోదిత టీకాలు లేదా నిర్దిష్ట చికిత్సలు అందుబాటులో లేకపోవడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెంచుతోంది.

**భారత్ తీసుకుంటున్న చర్యలు**

ఈ పరిస్థితుల దృష్ట్యా భారత ప్రభుత్వం పలు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. డీఆర్‌సీ, ఉగాండా, దక్షిణ సూడాన్‌లకు అనవసర ప్రయాణాలు మానుకోవాలని పౌరులకు సూచించింది. విమానాశ్రయాలు, ఓడరేవుల్లో ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల స్క్రీనింగ్‌ను కట్టుదిట్టం చేసింది. వ్యాధి లక్షణాలు ఉన్నవారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే ఎయిర్‌పోర్ట్ ఆరోగ్య అధికారులకు తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా పరిస్థితిని సమీక్షించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి దేశంలో ఎలాంటి కేసులు లేనప్పటికీ, అంతర్జాతీయ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు ఆరోగ్య శాఖ వర్గాలు స్పష్టం చేశాయి.

# బంగారం రీసైకిల్ చేద్దాం : ప్రధాని మోదీ పిలుపు

**మొదటిపేజీ తరువాయి**

ఈ విధానం ద్వారా బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రధాని అభిప్రాయపడ్డారు.

భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఉత్పత్తి చాలా స్వల్పం. ఈ కారణంగా ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లను వెచ్చించి బంగారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో మన దేశం సుమారు 72.4 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది ముడి చమురు తర్వాత దేశ దిగుమతి బిల్లులో అతిపెద్దది. బంగారం దిగుమతులకు చెల్లింపులు యూఎస్ డాలర్లలో చేయాల్సి రావడం వల్ల, రూపాయి విలువపై ఒత్తిడి పెరిగి, కరెంట్ అకౌంట్ లోటు విస్తరిస్తోంది.ఈ సమస్యకు పరిష్కారంగానే ప్రధాని రీసైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. అంచనాల ప్రకారం ప్రస్తుతం దేశంలోని గృహాలు, దేవాలయాల్లో దాదాపు 30,000 నుంచి 32,000 టన్నుల బంగారం నిరుపయోగంగా ఉంది. ఈ పాత ఆభరణాలు, నాణేలు, మరియు ఇతర బంగారు వస్తువులను కరిగించి, శుద్ధి చేసి, 99.9% స్వచ్ఛమైన బంగారంగా మార్చవచ్చు. ఈ బంగారాన్ని తిరిగి కొత్త ఉత్పత్తుల తయారీకి ఉపయోగించడం వల్ల దిగుమతుల అవసరం తగ్గుతుంది.

రీసైక్లింగ్ విధానం ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరం పరిశ్రమ నిపుణులు సైతం ప్రధాని ప్రతిపాదనను సమర్థిస్తున్నారు. ముత్తూట్ ఎగ్జిమ్ సీఈఓ కీయుర్ షా అంచనా ప్రకారం దేశంలో ఉన్న మొత్తం బంగారంలో కేవలం 1% ఏటా రీసైక్లింగ్‌కు వచ్చినా, మన దిగుమతులు 25 నుంచి 30 శాతం వరకు తగ్గుతాయి. స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ పరిశోధన హెడ్ సంతోష్ మీనా మాట్లాడుతూ, వ్యవస్థీకృత రీసైక్లింగ్ విధానం విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించడమే కాకుండా వాణిజ్య లోటును నియంత్రించి, దేశాన్ని ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తుందని వివరించారు.

ప్రధాని పిలుపును జ్యువెలరీ సంఘాలు స్వాగతించాయి. పాత బంగారాన్ని మార్చుకునే వారికి తక్కువ తరుగుతో కొత్త డిజైన్లు అందించే కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించాయి. మరోవైపు బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉండటంతో వివాహాలు, ఉన్నత విద్య వంటి అవసరాల కోసం పాత నగలను మార్చుకోవడం వినియోగదారులకు కూడా లాభదాయకంగా మారింది. మొత్తంమీద దిగుమతి చేసుకునే వినియోగదారుగా కాకుండా, దేశంలో ఉన్న వనరులనే సమర్థంగా వాడుకునే ఆర్థిక వ్యవస్థగా మారాలనేది ఈ పిలుపు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

# ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

**(మొదటి పేజి తరువాయి)**

తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించానని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు.తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007-08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యానించారు. వైసీపీ తనను ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టనివ్వనంటే ఈ ప్రాంతం ఆదరించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే తాను అధికారం కోరుకోలేదన్నారు.

అలాంటిది తెలంగాణలో ఎందుకు కోరుకుంటానని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు, నాయకులకు ఆంధ్రప్రదేశ్‌పై విద్వేషం లేదన్నారు. విద్వేషం చూపించి ఉంటే ఆ రాష్ట్ర ప్రజలు ఇక్కడ తిరిగేవారు కాదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తనకేం పని కొందరు ప్రశ్నిస్తున్నారన్నారు. మీరు ఎవరు తనను బెదిరించడానికి అని ప్రశ్నించారు. తెలంగాణ మీ అయ్య జాగీరా అని వారిని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ నిలదీశారు. తనపై దాడులు చేస్తామంటున్నారన్నారు. తనకు తెలంగాణలో కంటే ఏపీలోనే బెదిరింపులు అధికంగా ఉన్నాయని చెప్పారు. 2019 తాను ఓడిపోయినప్పుడు.. తెలంగాణ వాసులే.. ఇక్కడ ఆ పరిస్థితి రాదన్నారని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణలో జనసేన ఎదగాలని ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. మీరు ఎన్ని తిట్లు తిట్టినా.. తన గుండెలో తెలంగాణ ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ గూండాల బెదిరింపుల ముందు ఈ బెదిరింపులు ఓ లెక్కా? అని అన్నారు. ఓ విశ్లేషకుడు ఇక్కడ తన గురించి తప్పుగా మాట్లాడారని తెలిపారు. ఆ విశ్లేషకుడి వల్లే ఈ గొడవ మొదలైందన్నారు. ఆ వ్యాఖ్యలపైనే జనసేన సైనికులు స్పందించారని వివరించారు. కొన్ని చోట్ల కేసులు పెట్టారు.. అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించి 13 ఏళ్లు గడుస్తున్నా ఇంకా మేం నోరు మూసుకుని కూర్చోవాలా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో మార్పు తప్ప మేం అధికారం కోరుకోవడం లేదని పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. వాళ్లను అక్కడి నుంచి వెళ్లిపోమనడం కరెక్టేనా? అని ప్రశ్నించారు. ఇదిలావుంటే జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూబ్లీహిల్స్ నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది.

# మూడో దేశం జోక్యం కుదరదు

**మొదటిపేజీ తరువాయి**

వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ స్పందించింది. సరిహద్దు సమస్య పరిష్కారానికి భారత్, చైనాలతో మాట్లాడడమే కాకుండా, యూకే ప్రభుత్వంతో కూడా మాట్లాడామని చెప్పారు. యూకే ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిసారించాలని కోరుకుంటున్నామని, ఎందుకంటే, భారత్ ను బ్రిటీషర్లు పరిపాలించిన చరిత్రతో ఈ సమస్యకు సంబంధం ఉందని వివరించారు.

అంతేకాకుండా, భారత్ తమ భూభాగంలోకి చొరబడినట్లే, నేపాల్ కూడా కొన్ని ప్రాంతాల్లో భారత భూభాగాలను ఆక్రమించుకుందని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యలు నేపాల్ పార్లమెంటులో తీవ్ర దుమారం రేపాయి. ప్రభుత్వ వైఖరిని బలహీనపరిచారంటూ ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. దీంతో నేపాల్ విదేశాంగ శాఖ వెంటనే రంగంలోకి దిగి వివరణ ఇచ్చింది. ప్రధాని వ్యాఖ్యలు సరిహద్దులోని 'దస్‌గజ' (నో-మ్యాన్స్ ల్యాండ్) ప్రాంతంలో ఇరు దేశాల పౌరుల భూ వినియోగానికి సంబంధించినవని, అధికారిక ప్రాదేశిక వాదనలకు కాదని పేర్కొంది. లిపులేఖ్, కాలాపానీ, లింపియాధురా విషయంలో తమ అధికారిక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకుంటామని స్పష్టం చేసింది.

1816 నాటి సుగౌలీ ఒప్పందం ప్రకారం కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా తమవేనని నేపాల్ వాదిస్తుండగా, ఆ ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ పేర్కొంటోంది. తాజాగా నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన భారత్, ఏ దేశం మధ్యవర్తిత్వాన్నయినా తిరస్కరిస్తూ, ఇది కేవలం రెండు దేశాల మధ్య పరిష్కారం కావాల్సిన అంశమని తేల్చిచెప్పింది.

# తమిళనాడులో బీజేపీకి అన్నామలై రాజీనామా!

జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో సమావేశమై తన రాజీనామా లేఖను సమర్పించారు.

మాజీ ఐపీఎస్ అధికారి అయిన అన్నామలై, 2020లో బీజేపీలో చేరి అనతికాలంలోనే రాష్ట్రంలో కీలక నేతగా ఎదిగారు. అయితే, పార్టీలో తనకు సరైన అవకాశాలు లభించడం లేదని, ముఖ్యంగా 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు పెట్టుకోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ అధిష్ఠానం ఆయనకు రాజ్యసభ సీటు ఆఫర్ చేసినప్పటికీ, దానిని ఆయన తిరస్కరించారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) 108 స్థానాలతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, బీజేపీ కూటమి పరిమిత స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల తర్వాత పార్టీ నాయకత్వంతో ఆయనకు విభేదాలు పెరిగాయి.రాజీనామా అనంతరం అన్నామలై వెంటనే కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో లేరని, జాతీయవాద భావజాలంతో తొలుత ఒక ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించి, భవిష్యత్తులో దానిని రాజకీయ పార్టీగా మార్చే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జూన్ 4న ఆయన పుట్టినరోజు సందర్భంగా, చెన్నైలో ఆయన మద్దతుదారులు ఇప్పటికే భారీ పోస్టర్లు ఏర్పాటు చేశారు

# రాష్ట్రాభివృద్ధే సంకల్పం

**మొదటిపేజీ తరువాయి**

సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళాకారుల ప్రదర్శనలను తిలకించారు. 18 మంది పోలీసులకు, వారి కుటుంబాలకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ అమరులను స్మరించుకు న్నారు. రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ అధినేత సోనియాగాం ధీకి ధన్యవాదాలు తెలిపారు.

నిర్మూలనే ప్రాధాన్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా తెలంగాణ గడ్డపై పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు.రాష్ట్రంలో మహిళా సంఘాలు ఆర్థిక శక్తి కేంద్రాలుగా, ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్షేత్రాలుగా మారాయని సీఎం అన్నారు. ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్‌లు, గోదాములు, రైస్ మిల్లులు ఏర్పాటుకు వాళ్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆడబిడ్డలు దాదాపు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకోగలిగారనీ, ఆ డబ్బులు ఆ కుటుంబాల ఆర్థిక బలోపేతం కోసం దోహదపడ్డాయని తెలిపారు. 42.90 లక్షల కుటుంబాలకు రూ.500 రూపాయలకే సిలిండర్లు, 53.09 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో 3 కోట్ల 38 వేల మందికి సన్న బియ్యం ఇస్తున్నామన్నారు.

# సీబీఎస్ఈ చైర్మెన్, సెక్రెటరీ బదిలీ

**న్యూఢిల్లీ :జూన్ 02,ఆంధ్ర ప్రగతి** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ఆన్-స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థపై వివాదం రేగిన నేపథ్యంలో సీబీఎస్ఈ చెర్మెన్ రాహుల్ సింగ్, సెక్రె టరీ హిమాంశు గుప్తాలను బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు మంగళవారం తెలిపారు. అలాగే ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) వ్యవస్థ సేవలను సీబీఎస్ఈ తీసుకోవడంపై కూడా విచారణ జరిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 2019లో తెలంగాణా ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలపై చెలరేగిన వివాదంతో సంబంధమున్న సంస్థపై ప్రశ్నలను తాజాగా సీబీఎస్ఈ ఓఎస్ఎం వివాదం గుర్తుకు తెచ్చింది. 12వ తరగతి పరీక్షా ఫలితాలు విడుదలైన నేపథ్యంలో విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకన చేయడంలో తేడాలు, అలాగే రీ వాల్యుయేషన్ ప్రక్రియ సరిగా పనిచేయకపోవడంపై సీబీఎస్ఈ తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది.తమ అంచనాలకు, తమకు వచ్చిన మార్కులకు అసలు పొంతనే లేదని విద్యార్థుల్లో భావన నెలకొన్న నేపథ్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన ఓఎస్ఎం వ్యవస్థను కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ ఏడాది సీబీఎస్ఈ పాసైన శాతం 85.29శాతానికి పడిపోయింది. ఇది గతేడాది 88.39శాతంగా వుంది. అలాగే 90శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది.జవాబు పత్రాల కాపీలను కావాలని వేలాదిగా అభ్యర్థనలు రావడంతో ఫలితాల అనంతర వెరిఫికేషన్ పోర్టల్ కుప్పకూలింది. తమ జవాబు పత్రాలకు సంబంధించిన స్కాన్ చేసిన కాపీలను ఎవరైతే పొందగలిగారో ఆ విద్యార్థులు వాటిని చూసి షాక్‌కు గురయ్యారు. తాము జవాబు రాసిన పేజీలు అస్పష్టంగా వుండడమో లేదా కనిపించకుండా పోవడమో జరగడంతో వారు దిగ్భ్రాంతిలో వున్నారు. చాలామంది విద్యార్థులకు ఇతరుల జవాబు పత్రాలు వచ్చాయి.

# అమరావతి రైతులకు అండగా ఉంటాం

**మొదటిపేజీ తరువాయి**

ఉండాలన్నదే వైసిపి అభిమతమని చెప్పారు. ఇప్పటికే రాజధాని పేరుతో 50 వేల ఎకరాలు తీసుకున్నారని, ఇంకా 50 వేల ఎకరాలు అవసరం లేదని, అందుకే మావిగన్ ప్రతిపాదించామని పేర్కొన్నారు. ఇప్పటికే గన్నవరంలో విమానాశ్రయం ఉందని, దానికి దగ్గర్లోనే మరో ఎయిర్‌పోర్టుకు అనుమతి ఇవ్వరని చెప్పారు. పనులు ఇదే మాదిరి జరిగితే మరో 30 ఏళ్ల తరువాత కూడా రాజధాని కనిపించదన్నారు. కనీస మౌలిక వసతుల కల్పన కోసం ఎకరానికి రూ.2 కోట్లు కావాలని 12 ఏళ్ల క్రితమే బ్యాంకులకు నివేదిక ఇచ్చారని తెలిపారు. నిజానికి ఇప్పటికి ఆ రేటు పెరిగిందని, ఈ లెక్కన రోడ్లు, డ్రైనేజీ, నీరు, కరెంటు వీటిన్నింటికే ఎన్నేళ్లు ఎన్ని కోట్లు ఖర్చు చేయాలని ప్రశ్నించారు. కొండవీటి వాగుపై ఎత్తిపోతల పథకం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. వైసిపిది రైతు పక్షపాత ప్రభుత్వమని, ఇక్కడ రైతులకు నష్టం కలగ కూడదనే మావిగన్‌ను ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు.అమరావతి రైతులు ఏం కావాలంటే అది చేస్తామని, బలవంతపు భూ సేకరణ ఉండదని, అవసరం అయితే, భూములు వెనక్కి ఇస్తామని జగన్ తెలిపారు. రైతుల పోరాటంలో వైసిపి న్యాయ విభాగం కూడా పాలు పంచుకుంటుందన్నారు. ఇప్పుడు చేయగలిగింది న్యాయ పోరాటం మాత్రమేనని అన్నారు. మూడేళ్ల తర్వాత వైసిపి ప్రభుత్వం ఏర్పడితే, రైతులకు పూర్తి న్యాయం చేస్తామని చెప్పారు. రైతులు భూమి ఇవ్వకపోతే, ప్లాట్లు కేటాయించి రిజిస్ట్రేషన్ చేయడం, కాలువ తవ్వడం, రోడ్లు వేయడం, తోడిన నీరు పంపింగ్ చేయడం, దగ్గర్లో రిజర్వాయర్లు ఉంటే, గండి కొట్టి, నీరు పారేలా చేయడం దారుణమని తెలిపారు. అలా దౌర్జన్యం చేసే వారికి శిక్ష పడేలా చేస్తామని వివరించారు. ఇప్పుడు తప్పు చేస్తున్న ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించేలా చేస్తామని జగన్ రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు డాక్టర్ గాదె గంగాధరనాయుడు (కన్నారావునాయుడు) మాట్లాడుతూ ఉండవల్లిలో భూసమీకరణలో 1100 ఎకరాలు కావాలనుకుంటే ఇచ్చింది 250 ఎకరాలు మాత్రమే. అందులో రైతులు ఇచ్చింది 70 నుంచి 80 ఎకరాలు మాత్రమే. అక్కడ పారిశ్రామికవేత్తలు ఇచ్చిందే ఎక్కువని తెలిపారు.కరకట్టను విస్తరించుకోవచ్చని తెలిపారు

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కమిషన్ కట్టుబడి ఉంది.

..పెండింగ్ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు.
..కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదన.
రెండేళ్లలో అట్రాసిటీ రహిత జిల్లాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.
..ఎస్సీ కమీషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్
స్వీకరించిన దరఖాస్తులు 62.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 02:**
షెడ్యూల్డ్ కులాల ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ పర్యటిస్తోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్ తెలిపారు. మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులు పాల్గొని షెడ్యూల్డ్ కులాల ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.చిన్నరాముడు, ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల బిక్షమ్, డా.పి.గౌతం రాజు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, కమిషన్ స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటోందన్నారు. ప్రజలకు కమిషన్ పర్యటనకు సంబంధించిన సమాచారం చేరవేయడంలో కొంత సమాచార లోపం (కమ్యూనికేషన్ గ్యాప్) ఉన్న విషయాన్ని గుర్తించామని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా ప్రజలకు సమాచారం చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
నంద్యాల జిల్లాలో ఇతర జిల్లాలతో పోల్చితే అట్రాసిటీ కేసుల సంఖ్య తక్కువగా ఉండడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. కమిషన్ వద్ద ఉన్న వివరాల ప్రకారం జిల్లాలో మొత్తం 53 అట్రాసిటీ కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 11 కేసులకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన 42 కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. జిల్లాలో అట్రాసిటీ కేసుల నియంత్రణలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని పేర్కొంటూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను చైర్మన్ అభినందించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా, నిందితులకు సకాలంలో శిక్ష పడేలా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రతిపాదన పంపనున్నట్లు తెలిపారు.
షెడ్యూల్డ్ కులాలపై ఎలాంటి వివక్ష, వేధింపులు, అట్రాసిటీలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించిన ఆయన, రాబోయే రెండేళ్లలో కర్నూలు, నంద్యాల జిల్లాలను "అట్రాసిటీ ఫ్రీ జోన్"లుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని కమిషన్ సంకల్పించిందన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొని ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం అందే వాతావరణం కల్పించడమే కమిషన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

### రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్‌కు అందిన వినతులు

1)గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి చెందిన జి. రాజు తమ కుటుంబానికి చెందిన 5 ఎకరాల భూమిని జెఎస్డబ్ల్యూ సిమెంట్ పరిశ్రమకు అప్పగించామని, భూమి ఇచ్చిన సందర్భంగా తమకు సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే, ఇప్పటివరకు ఉద్యోగం కల్పించడంలో



తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొంటూ తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. 2)గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి చెందిన ఈ. రాజు, సర్వే నెం.260లో తనకు చెందిన ఒక ఎకరం భూమిని జెఎస్డబ్ల్యూ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. భూమికి సంబంధించి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్‌కు అర్జీ సమర్పించారు.
3)మిడ్తూరు మండలం సంకేసుల గ్రామానికి చెందిన ఎం. జయరాముడు తాను ఎలాంటి ఉద్యోగం లేదా వ్యాపారం చేయడం లేదని, ఆదాయపు పన్ను కూడా చెల్లించడం లేదని తెలిపారు. అయినప్పటికీ హౌస్ మ్యాపింగ్‌లో తాను ఆదాయపు పన్ను చెల్లింపుదారుడిగా నమోదై ఉండటంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందడం లేదని పేర్కొన్నారు. సంబంధిత వివరాలను సరిచేసి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకే.!

## -డాక్టర్ ఆర్ వెంకటరమణ జిల్లా వైద్యా ఆరోగ్య ధికారి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 02:**





నంద్యాలలోని జిల్లా వైద్య అధికారి కార్యాలయం నందు పిసిపిఎన్డిటి కమిటీ మీటింగు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే నిర్వాహకుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు జైలు శిక్షలు తప్పదని హెచ్చరించారు. చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం ప్రోత్సహించడం నేరమన్నారు. సమాజానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఆడబిడ్డ ముఖ్యమని ఆడబిడ్డను రక్షించే బాధ్యత సమాజంలోని ప్రతి పౌరునికి ఉందని తెలియజేశారు స్కానింగ్ సెంటర్లలో ధరల బోర్డులు ప్రదర్శించాలని సూచించారు ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లైన డాక్టర్ శ్రవణ్ కుమార్ రేడియాలజిస్ట్, డాక్టర్ లక్ష్మీనారాయణ చిన్నపిల్లల వైద్యులు, డాక్టర్ సలీమున్నీసా బేగం గైనకాలజిస్ట్, జిల్లా మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామన్న, బర్డ్స్ , మరియు మదర్ సొసైటీ స్వచ్ఛంద ప్రతిని దులు, వంశీ పాల్గొన్నారు.

# ప్రతి బడిఈడు చిన్నారిని పాఠశాలలో చేర్పించాలి.

## ..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 02:**



జిల్లాలో ఒక్క బడిఈడు చిన్నారి కూడా విద్యకు దూరం కాకుండా చూడడమే లక్ష్యంగా "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, పాఠశాల వెలుపల ఉన్న ప్రతి చిన్నారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో "బడి పిలుస్తోంది" కార్యక్రమం అమలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, డీఈఓ జనార్దన్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఐదేళ్లకు పైబడిన పిల్లల విభాగంలో మొత్తం 14 వేల మంది చిన్నారులను పాఠశాలల్లో చేర్చే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం 8,778 మంది పిల్లలు నమోదు కాగా, ఈ సంఖ్యను తక్షణమే 10 వేల మందికి పెంచేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 14,248 అడ్మిషన్ల లక్ష్యానికి గాను ప్రస్తుతం 8,778 అడ్మిషన్లు నమోదయ్యాయని, మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన సాధించే దిశగా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే రెండవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 1,31,974 అడ్మిషన్ల లక్ష్యానికి గాను 1,17,920 అడ్మిషన్లు పూర్తయ్యాయని, ప్రస్తుతం 89.33 శాతం నమోదైన ప్రవేశాలను 90 శాతానికి పైగా పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మొదటి తరగతి అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, పాఠశాలల్లో ఇంకా చేరని పిల్లలను ఇంటింటికీ వెళ్లి గుర్తించి ప్రవేశాలు కల్పించాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసి ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల మొదటి తరగతిలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేసి జిల్లాలో విద్యా నమోదు శాతాన్ని మరింత పెంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్.

-ప్రజల సంతృప్తి స్థాయిని స్వయంగా తెలుసుకున్న జిల్లా కలెక్టర్.
నాణ్యమైన పరిష్కారం, ప్రజా సంతృప్తే లక్ష్యం: కలెక్టర్.
ప్రజల అభిప్రాయాల ఆధారంగా సేవల మెరుగుదలకు చర్యలు: కలెక్టర్



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 02:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా పరిష్కరించబడిన ఫిర్యాదులపై అర్జీదారుల సంతృప్తి స్థాయిని స్వయంగా తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి మంగళవారం కలెక్టర్ ఛాంబర్ నుండి అర్జీదారులు సమ్మ నాగేశ్వరరావు, కొల్లి కోటేశ్వరావు, వడ్డే తిమ్మక్క, ఆర్.వి. సుబ్బారావులతో టెలిఫోన్ ద్వారా ప్రత్యక్షంగా మాట్లాడారు. ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత మరియు ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే లక్ష్యంతో ఈ ప్రత్యేక సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ ఆక్రమణలు, రికార్డ్ ఆఫ్ రైట్స్ నమోదు లోపాలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ పెన్షన్, వాగు పోరంబోకు భూముల ఆక్రమణ తదితర అంశాలపై అందిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని అర్జీదారుల నుంచే నేరుగా తెలుసుకున్నారు. భూ ఆక్రమణ ఫిర్యాదుకు సంబంధించి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ద్వారా స్థల సర్వే నిర్వహించి హద్దులు, కొలతలు చూపించడంతో సమస్య పరిష్కారమైందని అర్జీదారు తెలిపారు. సంబంధిత అధికారుల చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ పెన్షన్ అంశంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత లేకపోవడంతో పెన్షన్ మంజూరు సాధ్యం కాదని అధికారులు స్పష్టంగా వివరించినట్లు అర్జీదారు పేర్కొన్నారు. వాగు పోరంబోకు భూమి ఆక్రమణ ఫిర్యాదులో సంబంధిత భూమిపై ఆన్‌లైన్ పట్టాదారు/ఎంజాయర్ అప్‌డేషన్ సాధ్యం కాదని అధికారులు తెలియజేసినట్లు అర్జీదారు వివరించారు. అలాగే రికార్డ్ ఆఫ్ రైట్స్ కేసుకు సంబంధించి తహసీల్దార్ స్థాయిలో విచారణ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేసినట్లు, ఆ ఉత్తర్వులపై అసంతృప్తి ఉంటే ఆర్‌డీఓ కార్యాలయంలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును నిర్దేశిత కాలపరిమితిలో నాణ్యమైన పరిష్కారంతో ముగించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు పరిష్కార ప్రక్రియలో పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి మరియు అర్జీదారుల సంతృప్తికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఇటువంటి ప్రత్యక్ష ఫీడ్‌బ్యాక్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో భాజపా జిల్లా అధ్యక్షుడి భేటీ.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 02:** మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొనుటకు నంద్యాల కు వచ్చిన సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్‌ను భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో జిల్లాలోని దళిత వర్గాల సంక్షేమం, అభ్యున్నతి, స్థానిక సమస్యలతో పాటు పలు సామాజికాంశాలపై వారు కాసేపు చర్చించారు. దళితుల హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి కమిషన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యులు, పలువురు జిల్లా అధికారులు, స్థానిక భాజపా నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం న వసతి గృహాలలో మొక్కలు నాటే కార్యక్రమం.

## ..స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం నెరవేరాలి. -నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌ల ఏర్పాటుకు కృషి. -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.

**ఆంధ్ర ప్రగతి.కర్నూలు, జూన్ 02:**
ఎంస్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా జూన్ 5న మొక్కలు నాటడం , నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌ల ఏర్పాటుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.
మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల అమలు , నెట్ జీరో హెల్తీ క్యాంపస్ సంబంధిత అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని గురుకుల విద్యాసంస్థలు , సంక్షేమ వసతి గృహాలలో మరియు విద్యా సంస్థలను పర్యావరణమునకు హిత కేంద్రాలుగా మార్చడానికి కృషి చేయాలని తెలిపారు. నెట్ జీరో ఎనర్జీ లక్ష్యంతో నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు ద్వారా సొంతంగా విద్యుత్ తయారు చేసుకునే చర్యలు త్వరగా పూర్తి చేయాలని , పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచాలని సూచించారు. మియావాకి విధానంలో హైడెన్సిటీ మరియు అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్‌లను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పావు ఎకరా (25 సెంట్లు) విస్తీర్ణంలో ఏడు లేయర్ల విధానంలో 750 ఔషధ మొక్కలు , 750 గుబురు పొదల మొక్కలు , 100 అతిపెద్ద మొక్కలు ,150 సాధారణ మొక్కలు ఈ





విధంగా సుమారు 1625 మొక్కలను డి డబ్ల్యూ ఎం ఏ గుర్తించిన 13 విద్యా సంస్థలలో వివిధ పండ్ల రకాల మొక్కల తో కూడా జూన్ 5న నాటే చర్యలు తీసుకోవాలని పిడి నరసింహారెడ్డిని ఆదేశించారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ తదితర శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో వారి అవసరాలకు అనుగుణంగా ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 నాటికి మొక్కల ను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమగ్ర కార్యాచరణ ఉండాలని తెలిపారు. నెట్ జీరో కార్యక్రమాల్లో భాగంగా బయో వేస్ట్, లిక్విడ్ వేస్ట్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ,గ్రీన్ వాటర్ నిర్వహణలో భాగంగా సోక్ పిట్లు, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లు,గ్రే వాటర్ పిట్ లు , కిచెన్ వేస్ట్ పిట్లల ఏర్పాటు వారి సంఖ్య మరియు ఉత్పత్తి,వాడుక మేరకు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ పనులకు సచివాలయటి సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.
వసతి గృహాల్లో విద్యార్థులకు మంచి పౌష్టిక ఆహారాన్ని అందించాలని , వారికి అవసరమైన ఫ్యాన్లు , లైట్లు , టాయిలెట్లు చక్కగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని , దోమలు ఈగలు రాకుండా మెష్ లు ఏర్పాటు చేయాలని , మంచి త్రాగునీరు మరియు వాడుకోవటానికి నీరు ఎల్లప్పుడూ సమృద్ధిగా ఉండే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. ఈ విధంగా ఏర్పాటు చేయడం వలన పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్లో మంచి స్థానంలో ఉంటామని విద్యార్థులు చక్కగా చదివి దేశానికి ఉపయోగపడతారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వచ్చే ఐ.వీ.ఆర్.ఎస్. ఫోన్ కాల్ లకు ఏ విధంగా నంబరును నొక్కాలో తెలిపి మంచి పేరు తెచ్చే విధంగా చూసుకోవాలని తెలిపారు.
వసతి గృహాల్లో మంచి త్రాగునీరు , లాయలెట్స్ వ్యవస్థ బాగా ఉండాలని విద్యార్థులు వచ్చే లోపు మిగిలిన అన్ని పనులు పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ మనోహర్ ను కలెక్టర్ ఆదేశించారు. ఇతర వసతి గృహాల , పాఠశాలలకు కావలసిన సౌకర్యాల విషయంలో డిపిఓ భాస్కర్ కల్పించుకొని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.
వసతి గృహాల్లో చాలా కాలంగా ఒకే చోట పని చేస్తున్న సిబ్బందిని కలెక్టర్ అనుమతి తీసుకుని మార్చాలని బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూనను ఆదేశించారు.
వసతి గృహాల్లో త్రాగునీటి శాంపుల్ లను ఎప్పటికప్పుడు పరీక్షలు జరుపుకోవాలని , వంట చేసే సిబ్బంది , సెక్యూరిటీ వారు విద్యార్థులతో మంచి వ్యవహార శైలితో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశానికి డ్వామా పీడీ నర్సింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక , బీసీ వెల్ఫేర్ ప్రసూన , ట్రైబల్ వెల్ఫేర్ సురేష్ ,ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్ , అడిషనల్ కమిషనర్ కృష్ణ , మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ రఘు , డిపిఓ భాస్కర్ , నేడ్ క్యాప్ డి. ఓ. వీరేంద్ర , ఏపీఆర్జేసీ కోఆర్డినేటర్, నెట్ జీరో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లు గంగాధర్ మరియు పద్మావతి , సంబందించిన అధికారులు పాల్గొన్నారు.

# కుల వివక్షకు తావులేని సమానత్వ సమాజ నిర్మాణానికి అధికారులు కృషి చేయాలి.

**..ప్రజల పట్ల సహానుభూతితో స్పందించి పిటిషన్లను సకాలంలో పరిష్కరించాలి.**

**..నంద్యాల, కర్నూలు జిల్లాలను అట్రాసిటీ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.**

**..ఎస్సీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.**

**..అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రతిపాదన.**

**..ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్.**










**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 02:**
షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, కుల వివక్ష నిర్మూలన మరియు ఎస్సీ/ఎస్టీ చట్టాల సమర్థ అమలుపై అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ అన్నారు. ప్రజల సమస్యల పట్ల సహానుభూతితో స్పందిస్తూ, పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, పీసీఆర్ యాక్ట్ అమలు, భూ సమస్యలు, రిజర్వేషన్ల అమలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఆర్డీఓలు, డీఎస్పీలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మరియు జిల్లా అధికారులతో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఎస్సీ కమిషన్ కార్యదర్శి ఎస్. చిన్న రాముడు, కమిషన్ సభ్యులు మేకల భిక్షం, డా. పి. గౌతం రాజు, డీఆర్ఓ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కుల వివక్ష వివిధ రూపాల్లో కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వం సాధించేందుకు ప్రభుత్వ యంత్రాంగం మరింత చొరవతో పనిచేయాలని సూచించారు. ప్రజల పట్ల సానుభూతి, సేవాభావం అధికారుల్లో ఉండాలని, "రేపటి పని ఈరోజే చేయి – ఈరోజు పని ఇప్పుడే చేయి" అనే సూత్రంతో విధులు నిర్వర్తించాలని కోరారు. నంద్యాల, కర్నూలు జిల్లాలను అట్రాసిటీ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, ఈ ప్రాంతంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వేగంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. "జిల్లాలో మొత్తం 61 పిటిషన్లు అందగా, వాటిలో ఎస్సీ కమిషన్ కార్యదర్శికి 2, జిల్లా కలెక్టర్‌కు 47, జిల్లా ఎస్పీకి 11, నంద్యాల ఆర్డీఓకు 1 పిటిషన్ చొప్పున అందినట్లు తెలిపారు. అందిన పిటిషన్లలో కేవలం 11 కేసులకు మాత్రమే యాక్షన్ టేకెన్ రిపోర్టులు సమర్పించబడగా, మిగిలిన కేసులకు సంబంధించిన నివేదికలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు." కమిషన్ నుంచి వచ్చిన ప్రతి నోటీసుకు సకాలంలో స్పందించి ఏటీఆర్‌లు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక అధికారిని నియమించి కమిషన్‌తో సమన్వయం కొనసాగించాలని సూచించారు. అట్రాసిటీలు కేవలం కుల వివక్ష రూపంలోనే కాకుండా భూమి, ఆర్థిక మోసాలు, సేవా సంబంధిత అంశాల్లో కూడా జరుగుతున్నాయని తెలిపారు. తప్పుడు కేసులు, వాస్తవ పరిస్థితులను నిర్ధారించేందుకు కమిషన్ తరఫున ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలను గ్రామాలకు పంపనున్నట్లు వెల్లడించారు. ప్రజల ముందు అధికారులు ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు న్యాయం చేయడంలో అధికారులు చూపే నిబద్ధతే ప్రజల విశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు.
జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ/ఎస్టీ పీఓఏ చట్టం అమలు, భూ సమస్యల పరిష్కారం, రిజర్వేషన్ల అమలు, పీజీఆర్ఎస్ పిటిషన్ల పరిష్కారం, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో సుమారు 19.30 లక్షల జనాభా ఉండగా, అందులో 18 నుంచి 19 శాతం వరకు షెడ్యూల్డ్ కులాల జనాభా ఉన్నట్లు వివరించారు. జిల్లాలో 7 నియోజకవర్గాలు, 4 రెవెన్యూ డివిజన్లు, 30 మండలాలు, 6 అర్బన్ లోకల్ బాడీలు, 489 గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసే దిశగా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.
జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో ఎస్సీలపై జరిగే నేరాల సంఖ్య గత రెండేళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గినట్లు తెలిపారు. 2024లో 117 కేసులు నమోదవగా, 2025లో 71 కేసులకు తగ్గాయని, 2026 ఏప్రిల్ 30 నాటికి కేవలం 8 కేసులు మాత్రమే నమోదయ్యాయని వివరించారు. శారీరక దాడులు, లైంగిక దాడుల కేసుల్లో కూడా స్పష్టమైన తగ్గుదల నమోదైందన్నారు. జిల్లాలో మొత్తం 46 అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు ఉండగా, వాటిలో 31 కేసులకు చార్జ్‌షీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. మిగిలిన కేసులు సాక్షుల విచారణ, భూ రికార్డుల సేకరణ, కోర్టు స్టేలు తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పశుసంవర్ధక శాఖ ద్వారా జిల్లాలో ఎస్సీ లబ్ధిదారులకు మంజూరైన గోకులాల వివరాలను ఎస్సీ కమిషన్ చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. గోకులాల ద్వారా పాడి రైతుల ఆదాయం పెరగడంతో పాటు వర్మీ కంపోస్ట్ తయారీ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
జిల్లాలో ఎస్సీ లబ్ధిదారులకు సీనియారిటీ జాబితా ప్రకారం ఇప్పటివరకు 46 బోరు కనెక్షన్లు మంజూరు చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వివరించారు. పదో తరగతి ఫలితాలపై సమీక్షిస్తూ, ఉత్తీర్ణత శాతం మరియు విద్యార్థుల సంఖ్యపై డీఈఓను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తెలుగు సబ్జెక్టులో ఎక్కువ మంది విద్యార్థులు విఫలమైన నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
రుద్రవరం మండలానికి చెందిన మధ్యాహ్న భోజన పథకం ఆయాకు ఐదు నెలలుగా వేతనం అందలేదన్న ఫిర్యాదుపై విచారణ జరిపారు. వేతనం బ్యాంకు ఖాతాలో జమ చేసినప్పటికీ ఉపసంహరించుకోలేదనే ఫిర్యాదుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
హార్టికల్చర్, సూక్ష్మ నీటిపారుదల పథకాల కింద అవసరమైన గుంతల తవ్వకాలను ఉపాధి హామీ పథకం ద్వారా చేపడితే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని సూచించారు.
ఎస్ఆర్‌బీసీ కార్యాలయంలో కారుణ్య నియామకంలో చేరిన ఉద్యోగి సర్వీసు రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన వినతిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.
జిల్లాలోని 120 మత్స్యకార సంఘాల్లో ఎస్సీ సంఘాలు కేవలం మూడు మాత్రమే ఉన్నాయని, వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా మరిన్ని సంఘాలకు అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఆర్టీసీ ఉద్యోగి ఎం. కరుణయ్యకు పదోన్నతి ఇచ్చినప్పటికీ పోస్టింగ్ ఇవ్వలేదన్న ఫిర్యాదుపై స్పందిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు.

## మాజీ ఎమ్మెల్యే శిల్పా పై మండిపడ్డ టీడీపీ జిల్లా ఆఫీస్ సెక్రటరీ రాజేష్ (బుజ్జి).

**..ఐదేళ్లలో శిల్పా సాధించింది శూన్యం.. అభివృద్ధి అంటే 'సండే వచ్చి మండే పోవడం' కాదు.!**


**..కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే రోడ్డు పనులు పూర్తి చేసిన మంత్రి ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 02:**
నంద్యాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పై నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ఆఫీస్ సెక్రటరీ రాజేష్ (బుజ్జి) తీవ్రస్థాయిలో మండిపడ్డారు . స్థానిక మంత్రి ఫరూక్ గారి పై మాజీ సండే ఎమ్మెల్యే శిల్పా రవి చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాజేష్ (బుజ్జి) మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నంద్యాల నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని, ఆయన హయాంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. గత ఐదేళ్లలో పద్మావతి నగర్ రోడ్డును కేవలం సగం మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకున్నారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం మూడు నెలల కాలంలోనే మంత్రి ఫరూక్ గారు మిగిలిన సగం రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తీర్చారని గుర్తు చేశారు. నందమూరి నగర్ పేదల ఇబ్బందులను గమనించి 2018 లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు బ్రిడ్జ్‌కు శంకుస్థాపన చేశారని, ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి కూడా ఆ బ్రిడ్జ్ నిర్మాణాన్ని ఎందుకు పూర్తి చేయలేదో శిల్పా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కి అభివృద్ధి అంటే కేవలం సండే (ఆదివారం) నంద్యాలకు వచ్చి, మండే (సోమవారం) ఇక్కడి నుండి వెళ్ళిపోవడమే అని అన్నారు. నంద్యాలలో చిన్న కల్వర్టు కట్టినా కూడా దానికి పెద్ద ఎత్తున శిల్పా అని పేరు వేసుకుని ప్రచారం చేసుకోవడం ఆయనకు అలవాటు" అని ఎద్దేవా చేశారు. తమ మంత్రి ఫరూక్ కి ఇలాంటి హంగులు, ఆర్భాటాలు, షో పుటప్‌లు అవసరం లేదని.. ఆయన ఎప్పుడూ ఒకే ఒక వాహనంలో, ఒకే ఒక గన్‌మ్యాన్‌తో సాధారణంగా తిరుగుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తారని రాజేష్ (బుజ్జి) స్పష్టం చేశారు.

## జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో.. భారతీయ జనతా పార్టీలో చేరికలు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 02:**
ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు ప్రముఖులు పార్టీలో చేరారు. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం పెద్దల సూచనతో నంద్యాల జిల్లాకు చెందిన పలువురు మంగళవారం భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సమక్షంలో పార్టీ గూటికి చేరారు. పార్టీలో చేరిన లక్ష్మీపతి, సుంకయ్య, లక్ష్మయ్య, నీలకంఠేశ్వరావు, లక్ష్మణ స్వామి, ఏవీ. రమణ, లక్ష్మీనారాయణ, మధు, రామకృష్ణ, వెంకట రమణ, నవీన్‌లకు జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన నాయకులు మాట్లాడుతూ.. దేశాభివృద్ధి భాజపాతోనే సాధ్యమని, జిల్లాలో పార్టీ బలోపేతం కోసం శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు కశెట్టి కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కశెట్టి చంద్రశేఖర్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ విగ్రహాల డ్రామాలు.!

**..టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్. -వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది మీ కార్యకర్తలే**

**.. మీపై ఉన్న కోపంతోనే ఈ ఘాతుకం.! ..వ్యక్తిగత విమర్శలు పక్కన పెట్టి.. నంద్యాల అభివృద్ధి కోసం కలిసి రండి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 02:**
నంద్యాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న వైఎస్సార్ విగ్రహ వివాదంపై టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ తీవ్రంగా స్పందించారు. నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. అయితే ఈ ఘటన వెనుక ఉన్న అసలు నిజాలను తెలుసుకోకుండా ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ విగ్రహం తల భాగం కట్ చేసి తీసుకుపోయేంత ఘోరమైన కోపం ఆ వ్యక్తికి ఎందుకు వచ్చిందో వైఎస్సార్సీపీ నేతలు ఆలోచించుకోవాలని అన్నారు. ఆ పని చేసింది మరెవరో కాదు.. మీ సొంత కార్యకర్తనే అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి గారి పాలన పైన, మీ పార్టీ పైన, మీ పైన ఉన్న తీవ్ర వ్యతిరేకత, కోపం వల్లనే మీ కార్యకర్తనే ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు . అతన్ని పిలిపించి అడిగితే అసలు నిజాలు బయటపడతాయి" అని సవాల్ విసిరారు. వైఎస్సార్సీపీకి ఎన్నికలు వస్తున్నాయంటే చాలు ఏదో ఒక డ్రామా ఆడటం అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. 2004 ఎన్నికల సమయంలో వీరే నకిలీ స్టాంపులు తయారు చేసి డ్రామాలు ఆడారని, అలాగే 2014 లో వైఎస్సార్సీపీ నేత శిల్పా మోహన్ రెడ్డి టిడిపిలో ఉన్నప్పుడు ప్రస్తుత నంద్యాల మంత్రి ఫరూక్ ని, వారి సేవలను కొనియాడుతూ పెద్ద పెద్ద స్పీచ్‌లు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు మీ నాన్నగారు (మోహన్ రెడ్డి) చెప్పింది అబద్ధమా? లేక మీరు చెప్తున్నది అబద్ధమా? అని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలోనే నంద్యాల నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో వైయస్సార్ నగర్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు లేక నరకంలా మారిన పరిస్థితిని తాము మార్చామన్నారు. కోట్ల రూపాయల నిధులతో వైయస్సార్ నగర్ రోడ్లను అభివృద్ధి చేయడమే కాకుండా, 15 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మరో 4 నుండి 5 కోట్ల రూపాయలు తీసుకొచ్చి పనులు చేస్తున్నామని వివరించారు. అలాగే ఆటో నగర్ అభివృద్ధి కోసం 10 నుండి 15 కోట్ల రూపాయలు శాంక్షన్ చేసి పనులు ప్రారంభించామని, పద్మావతి నగర్ ఎక్స్‌టెన్షన్ పనులను వేగవంతం చేశామని గుర్తు చేశారు. 2018 లో చంద్రబాబు గారు శంకుస్థాపన చేసిన నందమూరి నగర్ బ్రిడ్జ్ కేసుల చిక్కుల్లో ఉంటే, వాటిని క్లియర్ చేసి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదు.. ఈరోజు మేముంటాం, రేపు మీరుండొచ్చు, ఎల్లుండి మళ్ళీ మేము రావచ్చు అని అన్నారు . కానీ మనందరి ముఖ్య ఉద్దేశం నంద్యాల అభివృద్ధి అయి ఉండాలన్నారు. వ్యక్తిగత విమర్శలు, విగ్రహాల రాజకీయం పక్కన పెట్టి.. చిత్తశుద్ధి ఉంటే నంద్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు కలిసి రండి" అని ఎన్ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. విగ్రహం డ్యామేజ్ అయితే దాన్ని మళ్ళీ ఇంకో చోట ప్రతిష్టించుకోవచ్చని, దాన్ని పెద్ద ఇష్యూ చేసి నంద్యాల ప్రశాంతతను దెబ్బతీయవద్దని హితవు పలికారు.

## 3న శిరివెళ్లలో శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవస్థానం భూముల వేలం పాటలు.

**ఉగ్రూపు దేవాలయాల కార్య నిర్వహణ అధికారి టి రామాంజనేయ శర్మ.**




**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల జూన్ 02:**
మండల కేంద్రంలోని స్థానిక శిరివెళ్లలో వెలసిన శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవస్థానం లకు చెందిన భూములను ఈనెల 3 తేదీన సాయంత్రం 4 గంటల30 ని. లకు. దేవస్థానం ఆవరణంలో కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణ అధికారి టి రామాంజనేయ శర్మ తెలిపారు. 2026–2027వ సంవత్సరమునకు కౌలు వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి పాట దారులు 2వేల రూపాయలు డిపాజిట్ చెల్లించాలన్నారు. హెచ్చు పాట పాడినవారు మొత్తం చెల్లించి రషీదు పొందవలెనని అన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# సమాజాభ్యున్నతికి ధర్మమే పునాది.



**ఆంధ్ర ప్రగతి కోటకొండ/ ఆస్పరి జూన్ 2:**
ధర్మం అంటే వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశ శ్రేయస్సుకు మార్గదర్శకమైన జీవన విధానమని, ధర్మబద్ధమైన ఆలోచనలు, నైతిక విలువలు, పరస్పర గౌరవం, సేవాభావం ఉన్నచోటే శాంతి, సౌభ్రాతృత్వం, సర్వాంగీనాభివృద్ధి సహజంగా వికసిస్తాయని, ధర్మం వ్యక్తిని సద్గుణవంతునిగా తీర్చిదిద్దుతుందని, సద్గుణవంతులైన వ్యక్తులే ఆదర్శ కుటుంబాలను నిర్మిస్తారని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఆస్పరి మండలం, డి.కోటకొండ గ్రామంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం స్థానిక భజన మండలి నిర్వహించిన భజనలు, స్వాత్మానందస్వామి చేసిన ఆధ్యాత్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కె.గంగాధర రెడ్డి, డి.కె.హనుమంతు, కొండారెడ్డి, రామాంజనేయులు, అర్చకులు శ్రీనువాసులు, గోపాల్,రామిరెడ్డితోపాటు భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# రష్యా చేరుకున్న మంత్రి నారా లోకేష్

**సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో పాల్గొననున్న లోకేష్**

**పారిశ్రామికవేత్తలతో భేటీ అయి ఏపీకి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం**



**మాస్కో జూన్ 2 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనకు వెళ్లారు. ఆరు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం రష్యా రాజధాని మాస్కో చేరుకున్నారు.మాస్కో విమానాశ్రయంలో లోకేష్‌కు భారత రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ నిఖిలేశ్ గిరి, స్థానిక ఆంధ్ర ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) ఘన స్వాగతం పలికారు. ఆయన జూన్ 7 వరకు రష్యాలోనే పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా ఆయన సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగే అంతర్జాతీయ ఆర్థిక వేదిక (SPIEF 2026) సదస్సులో పాల్గొననున్నారు. ఇది రష్యాలో జరిగే కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య, పెట్టుబడుల సదస్సు.ఈ వేదికపై లోకేష్ ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించనున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విదేశీ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడమే లక్ష్యంగా చేపడుతున్న చర్యల్లో ఈ పర్యటన ఒక భాగమని తెలుస్తోంది. పర్యటనకు సంబంధించిన మరిన్ని వివరాలు సదస్సు జరుగుతున్న కొద్దీ వెల్లడయ్యే అవకాశం ఉంది

# లాటరైట్‌కు ‘సేవింగ్ క్లాజ్‘ ఇవ్వండి.

## కిషన్ రెడ్డికి చంద్రబాబు లేఖ

లాటరైట్ వర్గీకరణ మార్పుపై కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

కొత్త నిబంధనలతో ఏపీలో 402 గనుల లీజుల ప్రక్రియ నిలిపివేత

పాత దరఖాస్తులకు ‘సేవింగ్ క్లాజ్‘ కింద రెండేళ్ల వెసులుబాటుకు విజ్ఞప్తి

పరిశ్రమలకు ముడిసరుకు, ఉపాధి నిలబెట్టాలని లేఖలో స్పష్టీకరణ

**మంగళగిరి జూన్ 2 ఆంధ్ర ప్రగతి**



లాటరైట్ ఖనిజం వర్గీకరణలో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పుల వల్ల రాష్ట్రంలో తలెత్తిన ఇబ్బందులను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర గనుల శాఖామంత్రి కిషన్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. పెండింగ్‌లో ఉన్న గనుల లీజు దరఖాస్తుల విషయంలో వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు.లాటరైట్‌లో అల్యూమినియం శాతం 20 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, దాన్ని ఉప ఖనిజంగా కాకుండా బాక్సైట్‌గా (మేజర్ మినరల్) పరిగణించాలని కేంద్రం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఏపీలో గనుల లీజుల ప్రక్రియ పూర్తిగా స్తంభించిపోయిందని చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. కేంద్రం తెచ్చిన కొత్త నిబంధనల వల్ల, మైనర్ మినరల్ కింద ప్రాసెస్ చేస్తున్న 402 గనుల లీజు దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసినట్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. నిలిచిపోయిన వాటిలో 19 లెటర్ ఆఫ్ ఇంటెంట్, 113 ప్రభుత్వ భూములు, 255 అటవీ భూములు, 15 పట్టా భూములకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని వివరించారు.పాత నిబంధనల ప్రకారమే వందలాది మంది దరఖాస్తుదారులు అప్లికేషన్ ఫీజులు, భూముల కొనుగోళ్లు, అటవీ అనుమతుల కోసం ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. గతంలో మైకా, క్వార్ట్జ్, బొరైట్స్ వంటి ఖనిజాలను మైనర్ నుంచి మేజర్ కేటగిరీకి మార్చినప్పుడు కేంద్రం ‘సేవింగ్ క్లాజ్‘ ఇచ్చిందని గుర్తుచేశారు. అదే తరహాలో లాటరైట్ ఖనిజానికి కూడా సేవింగ్ క్లాజ్ వర్తింపజేసి, పెండింగ్‌లో ఉన్న 402 దరఖాస్తులను పాత నిబంధనల ప్రకారమే ప్రాసెస్ చేయడానికి రెండేళ్ల పాటు వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సడలింపు ఇస్తే దరఖాస్తుదారులకు ఆర్థిక నష్టం జరగదని, న్యాయపరమైన వివాదాలు నివారించవచ్చని తెలిపారు. సేవింగ్ క్లాజ్ అమలు చేస్తే సిమెంట్, ఐరన్ ఓర్, రోడ్డు నిర్మాణ పరిశ్రమలకు ముడిసరుకు కొరత లేకుండా ఉపాధి అవకాశాలు నిలబడతాయని చంద్రబాబు తన లేఖలో స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వ వెన్నుపోటుకు రెండేళ్లు

## ..మోసాలు, నయవంచనపై పుస్తకం, పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 02:**
తెలుగునాట ప్రజాస్వామ్యం నిలువునా వంచనకు గురైందా? అధికార పీఠం కోసం ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? నమ్మి ఓటేసిన రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన బహుమతి “వెన్నుపోటు“ మాత్రమేనా?అవునంటోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ! నేడు నంద్యాల వేదికగా వైసీపీ జిల్లా కార్యాలయంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల వైఫల్యాలపై వైసీపీ నేతలు జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్యే లు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, గంగుల బీజేంద్రనాథ్ రెడ్డి, సిఇసి మెంబర్ పి.పి నాగిరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పి.పి మధుసూదన్ రెడ్డి, హాజరై వెన్నుపోటు రెండేళ్లు...కూటమి ప్రభుత్వ మోసాలపై పుస్తకం, వాల్ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి యుద్ధభేరి మ్రోగించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో..



జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 2 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చలేదని, రాష్ట్ర ప్రజలను నయవంచన, మోసం చేసి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలను కల్పించలేదని నిరుద్యోబృతి మహిళలకు శ్రీనిధి పథకం అమలుకలేదని తల్లికి వందనం, రైతుభోరోసా వంటి పథకాలను పూర్తిస్థాయిలో ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించలేది, మొక్కజొన్న రైతులను నట్టేట ముంచారని, అలాగే జొన్నల కొనుగోలుకూడా అరకొరగా చేపట్టారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మీడియా ప్రతినిధులకు మూడు బెడ్‌రూమ్‌ల ఇళ్లు ఉచితంగా ఇస్తామని నంద్యాల శ్రీనివాస్ సెంటర్‌లో ప్రకటించిన హామీని సైతం ప్రభుత్వం అమలు చేయలేదన్నారు.ప్రజలతో పాటు మీడియా ప్రతినిధులను కూడా మోసం చేసిన ప్రభుత్వం ఇదేనని విమర్శించారు .2029లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీడియా ప్రతినిధుల సొంతింటి కలను సాకారం చేస్తారని చెప్పారు..!! “విజన్ కాదు.. వెన్నుపోటే టీడీపీ నైజం“ అంటూ మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు ఆకాశమే హద్దుగా హామీల వర్షం కురిపించారని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. టీడీపీ రెండేళ్ల వైఫల్యాలను ఎండగట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశాల్లో జగన్నామస్మరణ తప్ప రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రస్తావించలేదన్నారు. డైవర్ట్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. నంద్యాల నియోజకవర్గంలో సీనియర్ మంత్రి ఈ రెండేళ్ల పాలనలో నంద్యాలలో ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదని, వైసీపీ అధికారంలో ఉన్న కాలంలో చేపట్టిన పనులను నేటికి పూర్తి చేయలేదని 6సార్లు మంత్రి పదవిలో ఉన్న సీనియర్ నాకయుడు నంద్యాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. నంద్యాలలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్సార్ విగ్రహాన్ని నడిబొడ్డులో సీసీ కెమెరాల మధ్య పట్టపగలు విగ్రహాన్ని ద్వంసం చేస్తుంటే పోలీసు వ్యవస్థ పర్యవేక్షణలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూంలో విద్వంస దృశ్యాలను చూస్తూ ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఇది పోలీసు నిఘావైపల్యంగా భావిస్తున్నామన్నారు. ఒక పథకం ప్రకారం విగ్రహాన్ని ద్వంసం చేసి వైసీపీ కార్యకర్త అని ముద్రవేసి పథక రచన చేశారని, టీడీపీ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. విగ్రహాన్ని ద్వంసం చేసిన వ్యక్తి గురించిన వివరాలను ఫోటోలను ఘటన జరిగిన కొద్ది నిమిషాల్లో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం దారుణంగా ఉందన్నారు. ఆ వ్యక్తి పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టకపోగా టీడీపీ వారు ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారం వ్యవహరించారని విమర్శించారు. మతిస్థిమితం లేదని ఒక సారి, వైసీపీ కార్యకర్త అని మరోసారి ఇలా వారు ఇష్టం వచ్చినట్లుగా పోలీసులు వంతపాడారని అన్నారు. తమకు



నచ్చిన రీతిగా స్టేట్మెంట్ తీసుకొని బెయిలబుల్ కేసును నమోదు చేశారని పేర్కొన్నారు. కేవలం తమ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు సంనయాన్ని పాటించమన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే విగ్రహద్వంసం కుట్ర జరిగిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గం పరిశీలకుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ శశికళ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్స్ రామలింగా రెడ్డి, సాయినాథ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాల్మిల్ అమీర్, మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా అధికార ప్రతినిధి అనీల్ అమృతారాజ్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పురుషోత్తమ రెడ్డి, జిల్లా ఎస్టీ కార్యవర్గ సబ్యులు శంకర్ నాయక్, వైసీపీ నాయకులు లాల్ స్వామి, సాయిరాం రెడ్డి, కృష్ణ మోహన్, శ్రీకాంత్ రెడ్డి, మునయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని 15 వేల హెక్టార్లకు పెంచే విధంగా చర్యలు చేపట్టండి.

**..పండ్ల తోటలన్నింటినీ డ్రిప్ సేద్యం కిందకు తీసుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టండి.**

**..జిల్లాలో ఈ ఏడాది 10 వేల హెక్టార్లలో నిర్దేశించిన డ్రిప్ ఇరిగేషన్ లక్ష్యాన్ని సాధించాలి.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 02:**
జిల్లాలో ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని 15 వేల హెక్టార్లకు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కర్నూలు మండలంలోని తొలిసాపురం గ్రామంలో గోవర్ధన్ రెడ్డి అనే రైతు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటను కలెక్టర్ పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ రైతు గోవర్ధన్ రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను పరిశీలించి, అక్కడ అమలు చేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ విధానం, అంతర పంటల సాగు వివరాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, డ్రిప్ ఇరిగేషన్




వ్యవస్థలోని వివిధ భాగాల వినియోగం, నిర్వహణపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్క్రీన్ ఫిల్టర్, వాల్వులు, హెడ్ కంట్రోల్ యూనిట్ (హెచ్‌సీయూ) వంటి పరికరాల ప్రాముఖ్యతతో పాటు, డ్రిప్ ద్వారా ఎరువుల పంపిణీ చేసే ఫెర్టిగేషన్ విధానంపై రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
జిల్లాలో ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని మరింత పెంచే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కాలానుగుణ పంటలతో పాటు దీర్ఘకాలిక పంటల సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా మామిడి, జామ, నిమ్మ తదితర దీర్ఘకాలిక తోటల పంటలన్నింటిలో డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి పొదుపుతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన రైతులకు విస్తృత అవగాహన కల్పించి ఎక్కువ మంది లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గత ఏడాది జిల్లాలో 8,260 హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్‌ను అమలు చేశామని, ఈ ఏడాది 10,000 హెక్టార్లలో నిర్దేశించిన డ్రిప్ ఇరిగేషన్ లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డ్వామా పిడి నరసింహ రెడ్డి, ఏపీఎంఐపీ పిడి శ్రీనివాసులు, ఉద్యాన శాఖ అధికారి రాధాకృష్ణారెడ్డి, ఏపీఎంఐపీ ఏపిడి ఫిరోజ్, కర్నూలు తహశీల్దార్ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై జగన్ నీతులు విడ్డూరం

## అమరావతిపై విషం చిమ్ముతూనే ఉన్నారు -మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి,జూన్ 2 ఆంధ్ర ప్రగతి**
రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అనుసరిస్తున్న వైఖరిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి మాట్లాడుతూ.. అమరావతి గురించి వైఎస్ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిని ఐదేళ్ల పాలనలో అల్లకల్లోలం చేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. రాజధాని నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపివేసి ఇప్పుడు అభివృద్ధిపై నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ జగన్ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు.మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టి.. ఇప్పుడు మావిగన్ అంటూ మాయ మాటలు చెప్తున్నారంటూ జగన్‌పై మంత్రి రాంప్రసాద్ రెడ్డి నిప్పులు చెరిగారు. అమరావతి రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది గత వైసీపీ పాలనలోనే అని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు నిలిపి వేసి.. తద్వారా వేలాది కుటుంబాలను ఇబ్బందులకు



గురి చేశారంటూ జగన్ తీరును మంత్రి మండిపల్లి తుర్పారబట్టారు. మరావతికి భూములు ఇచ్చిన రైతుల విశ్వాసాన్ని దెబ్బతీశారంటూ ఆ పార్టీ అగ్రనేతలపై మంత్రి నిప్పులు చెరిగారు. ఐదేళ్లు అధికారంలో ఉండి రాజధాని అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. ఇప్పుడు అమరావతిపై అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్ వైఖరిని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వివరించారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం, రాష్ట్రం కలిసి వేగంగా చర్యలు చేపడుతున్నాయని పేర్కొన్నారు.÷రాజధాని అభివృద్ధిని అడ్డుకున్న వారే అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు. రైతుల ఆకాంక్షలు, రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాజధాని నిర్మాణం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని.. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన అంశమన్నారు. జగన్ చేసిన విధ్వంసాన్ని సరిదిద్దుతూ అమరావతిని తిరిగి గాడిలో పెడుతున్నామని ఆయన వివరించారు. రాజధానిపై రాజకీయాలు కాకుండా రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టాలని వైఎస్ జగన్‌కు ఆయన సూచించారు. అమరావతి రాష్ట్ర గౌరవానికి ప్రతీక, దాని నిర్మాణాన్ని పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.